అఖిలాండేశ్వరీ... పాలయమాం గౌరీ


కడప నగర శివార్లలోని లలితాంబిక అమ్మవారు


చిన్నశేష వాహనంపై కడప రాయుడు


దుర్గమ్మగా శ్రీ విజయదుర్గాదేవి

కడప సెవెన్‌రోడ్స్ : శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా బుధవారం ఆలయాలు భక్తులతో పోటెత్తాయి. దేవుని కడపలోని శ్రీ లక్ష్మి వెంకటేశ్వర స్వామిని చిన్నశేష వాహనంపై కొలువుదీర్చి మాడ వీధుల్లో విహరింపజేశారు. అలాగే శ్రీ బాలపోలేరమ్మను శ్రీ దుర్గాదేవిగా, శ్రీ కన్యకాపరమేశ్వరీదేవి ఆలయంలో అమ్మవారిని అదే రూపంలో అలంకరించగా, శ్రీ విజయ దుర్గాదేవిమాతను దుర్గమ్మగా కొలువుదీర్చారు. గడ్డిబజారు సత్యదేవుని ఆలయంలో స్వామికి మోహిని అలంకారం చేశారు. కామకోటి కళాంబదేవిని శ్రీ మోహినిగా, నడివీధి గంగమ్మను శ్రీ పార్వతీదేవి అలంకారంలో కొలువుదీర్చారు. భావనారుషి ఆలయంలో అమ్మవారిని శ్రీ ప్రత్యంగిరాదేవిగా అలంకరించారు. నగర శివార్లలోని శ్రీ లలితాపంచాయతన ఆలయంలో అమ్మవారిని శ్రీ మహిషాసుర మర్దినిదేవిగా, వైఎస్సార్ కాలనీలో అంకాలమ్మ తల్లిని శ్రీ మహిషాసుర మర్దినిదేవిగా అలంకరించారు. నబీకోట శివాలయం, నాగరాజుపేట శ్రీ రాజరాజేశ్వరీ ఆలయం, ఎర్రముక్కపల్లె చౌడేశ్వరీదేవి ఆలయం, రాజారెడ్డివీధి గంగాదేవి ఆలయంలో పూజలు నిర్వహించారు. గురువారం విజయదశమి సందర్భంగా రాత్రి 9 గంటల అనంతరం అన్ని ఆలయాల నుంచి అమ్మవారికి గ్రామోత్సవాన్ని నిర్వహించనున్నారు.

మార్కెట్లకు విజయదశమి సందడి


పూల దుకాణాల వద్ద సందడి

కడప సెవెన్‌రోడ్స్ : విజయదశమి సందర్భంగా మార్కెట్లు రద్దీగా మారాయి. జనంలో పండుగ కళ కనిపిస్తోంది. గురువారం విజయదశమి పండుగ నాడు నిర్వహించాల్సిన పూజా కార్యక్రమాలు, ఇతర సంప్రదాయ కార్యక్రమాలకు బుధవారం ప్రజలు హడావుడిగా ఏర్పాట్లు చేసుకుంటున్నారు. దీంతో కొనుగోలుదారులతో మార్కెట్లు రద్దీగా కనిపించాయి.

పండుగ సీజన్ సందర్భంగా పూల ధరలతో పాటు ఇతర వస్తు సామాగ్రి ధరలు పెరిగాయి. అన్ని రకాల పండ్ల ధర కిలో రూ. 60 నుంచి రూ. 140 పైనే ఉంది.

ఇంటివద్దకే పింఛన్...ఇక లేనట్టే!


పద్మావతి నగర్ సచివాలయం వద్ద పింఛన్ల కోసం గుమికూడిన పింఛన్‌దారులు


ఏపీహెచ్‌బీ కాలనీ సచివాలయానికి తరలివచ్చిన పింఛన్‌దారులు


నడవలేని స్థితిలో పింఛన్ కోసం వచ్చిన వృద్ధుల అవస్థలు

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో కదుపులో చల్ల కదలకుండా...ఇంటి గడప నుంచి కాలు బయట పెట్టకుండా తెల్లవారుజామునే తలుపుతట్టి పింఛన్ అందించేవారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత పింఛన్‌దారులు గడప దాటి బయటకు వచ్చి వీధుల్లో పింఛన్లు తీసుకుంటున్నారు. ఈ అక్టోబర్ నెలలో వీధుల్లోంచి సీన్ సచివాలయాలకు చేరింది. వృద్ధులు, వికలాంగులు, వితంతువులు తెల్లవారుజాము నుంచే సచివాలయాల వద్ద పింఛన్ల కోసం ఎదురుచూపులు చూశారు. సచివాలయ సిబ్బంది 8.30 గంటలకు సచివాలయాలకు చేరుకొని వారికి పింఛన్లు పంపిణీ చేశారు. చంద్రబాబుకు ఓటేసినందుకు తమకు ఇలా జరగాల్సిందేనంటూ కొందరు సణుక్కుంటూ పోయారు.

– కడప కార్పొరేషన్

పారిశుధ్య పనుల పరిశీలన

కడప కార్పొరేషన్: కడప నగరపాలక సంస్థ పరిధిలో జరుగుతున్న పారిశుధ్య కార్యక్రమాలను కమిషనర్ మనోజ్‌రెడ్డి పరిశీలించారు. బుధవారం మార్నింగ్ విజిట్‌లో భాగంగా వెస్ట్ జోన్‌లో పర్యటించి ప్రజలతో మాట్లాడారు. ప్రతిరోజూ చెత్తను సేకరిస్తున్నారా, కాలువలను శుభ్ర పరుస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా స్థానికులు మాట్లాడుతూ కాలువలు బ్లాక్ అయి పాత ఇల్లులు పడిపోతున్నాయని, అద్దె ఇళ్లలో ఉంటున్నామని చెప్పారు. దీనిపై కమిషనర్ స్పందిస్తూ సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నగరపాలక అధికారులు పాల్గొన్నారు.

వైద్యుల సమస్యలను పరిష్కరించాలి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తున్న వైద్యుల సమస్యలను తక్షణమే పరిష్కరించి ఆందోళనలను విరమింప చేయకుండా ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టడం సమంజసం కాదని సీపీఎం కడప నగర కార్యదర్శి రామమోహన్ అన్నారు. బుధవారం నగరంలోని సీపీఎం కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ప్రజారోగ్యం మీద వైద్యుల సమ్మె ప్రభావం పడుతుందని, రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకొని సమస్య పరిష్కారం చేయాలన్నారు. సమావేశంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు దస్తగిరిరెడ్డి, రామకృష్ణారెడ్డి, నరసింహ పాల్గొన్నారు.

బీఎస్‌ఎన్‌ఎల్ సంస్థ అభివృద్ధి కృషి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: బీఎస్ఎన్ఎల్ అభివృద్ధికి ఉద్యోగులు, వినియోగదారులు కృషి చేయాలని బీఎస్ఎన్ఎల్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ రామ్ ప్రకాశ్ పేర్కొన్నారు. బుధవారం బీఎస్ఎన్ఎల్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా బీఎస్ఎన్ఎల్ ఉద్యోగులు నగరంలోని వివిధ ప్రాంతాల్లో ర్యాలీ నిర్వహించారు. బీఎస్ఎన్ఎల్ 4జీ సేవలను అందిస్తున్నదని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో డివిజనల్ ఇంజనీర్లు బసవరాజు, రెడ్డి బాబు, భాస్కరాచారి, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఘన సన్మానం


కోట మృత్యుంజయరావును సన్మానిస్తున్న జిల్లా రచయితల సంఘ ప్రతినిధులు

కడప ఎడ్యుకేషన్: జిల్లాలో పర్యాటక రంగానికి విశిష్టమైన కృషి చేసిన వైవీయూ లలిత కళల విభాగం అధ్యాపకులు డాక్టర్ కోట మృత్యుంజయరావుకు పర్యాటక ఎక్సలెన్స్ అవార్డు రావడం మన జిల్లా పర్యాటక రంగానికి పట్టాభిషేకం చేయడమేనని వైవీయూ పాలకమండలి సభ్యులు ఆచార్య మూల మల్లికార్జున రెడ్డి అన్నారు. ఇటీవల సీఎం చంద్రబాబు చేతుల మీదుగా పర్యాటక ఎక్సలెన్స్ అవార్డు అందుకున్న మృత్యుంజయరావును వైయస్సార్ కడప జిల్లా రచయితల సంఘం బుధవారం కడప సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో ఘనంగా సన్మానించారు.

జిల్లాలో ప్రజల భద్రతకు 'విజిబుల్ పోలీసింగ్'

కడప అర్బన్: వైఎస్ఆర్ కడప జిల్లాలో ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణ కోసం జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఆదేశాల మేరకు పోలీసులు 'విజిబుల్ పోలీసింగ్' కార్యక్రమాన్ని విస్తృతంగా నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమం ద్వారా పోలీసులు ప్రజలకు మరింత చేరువవుతూ, నేరాలను నియంత్రించడం, రహదారి భద్రతపై అవగాహన కల్పించడం వంటి చర్యలు చేపడుతున్నారు.